రాష్ట్ర రహదారులన్నింటిపై టోల్?

- రూ.30 వేల కోట్ల సమీకరణే లక్ష్యం
- మూడు మార్గాల్లో మెట్రో పొడిగింపు
- నేడు క్యాబినెట్ భేటీలో చర్చించే అవకాశం
- కొత్త ఆర్వోర్ చట్టాన్ని ఆమోదించనున్న మంత్రిమండలి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించేందుకు రాష్ట్ర రహదారులన్నింటి నిర్వహణను ప్రైవేట్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమైనట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టోల్ వసూలును ఆదాయ వనరుగా చూపి రూ.30వేల కోట్లు రుణాలను సమీకరించేందుకు ప్రణాళికలు రచించినట్టు సమాచారం. శనివారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరుగనున్న క్యాబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. క్యాబినెట్ సమావేశం వాస్తవానికి ఈ నెల 23న సమావేశం జరగాల్సి ఉండగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సియోల్ పర్యటన నేపథ్యంలో శనివారానికి వాయిదా పడింది. ఈ సమావేశంలో కొత్త ఆర్వోఆర్ చట్టంపై చర్చించి ఆమోదించనున్నట్టు తెలుస్తున్నది. గ్రామ స్థాయి రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటుకు సైతం ఆమోదం తెలుపనున్నట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. డ్యాం రిహాబిలిటేషన్ అండ్ ఇంప్రూవ్మెంట్ ప్రాజెక్టు (డ్రిప్) పథకం కింద నీటిపారుదల శాఖ ప్రపంచ బ్యాంకు నుంచి రూ.645 కోట్లు రుణం తీసుకునేందుకు క్యాబినెట్ అనుమతించనున్నట్టు సమాచారం. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కింద రూ.7వేల కోట్ల రుణ సేకరణకూ అనుమతించనున్నట్టు చెప్తున్నారు. మిల్లర్ల నుంచి సీఎంఆర్ కోసం బ్యాంక్ గ్యారంటీపైనా చర్చించే అవకాశం ఉన్నది. ఉద్యోగులకు 2 డీఏలు ఇచ్చే అంశంపై చర్చిస్తారని సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. అయితే వచ్చే ఏడాది మార్చి తర్వాతే ఆర్థిక పరమైన అంశాలపై చర్చిద్దామని సీఎం రేవంత్ రెడ్డి గురువారం ఉద్యోగ సంఘాల నేతలకు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో డీఏ మంజూరు కష్టమని చర్చించుకుంటున్నారు. హైడ్రా చట్టబద్ధత, మూసీ బాధితులకు పరిహారం వంటి అంశాలపై క్యాబినెట్‌లో చర్చించే అవకాశం ఉన్నది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మంత్రి మండలి కూలంకషంగా చర్చించనున్నట్టు తెలుస్తున్నది. ఆర్థిక పరిస్థితి నానాటికి దిగజారుతుండటంతో ఆదాయం ఎలా పెంచుకోవాలి? ఏయే విభాగాల్లో పన్నులు పెంచాలో మంత్రులు చర్చిస్తారని సమాచారం. మొదట ఎక్సైజ్ శాఖలో ధరలు పెంచే అవకాశం ఉన్నదని, ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారని చెప్తున్నారు. హైడ్రా, కొత్త రెవెన్యూ చట్టంపై ఆర్డినెన్స్ తీసుకొచ్చే బదులు వచ్చే నెలలో రెండుమూడు రోజులపాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని భావిస్తే.. తేదీలను ఖరారు చేసే అవకాశం ఉన్నది.

కోవా లక్ష్మి ఎన్నికపై పిటిషన్ కొట్టివేత

హైకోర్టు చరిత్రలోనే సత్వర తీర్పు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి (ఆసిఫాబాద్) ఎన్నికను సవాల్ చేస్తూ ఆమె ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నిబంధనల ప్రకారం ఎన్నికల అఫిడవిట్‌లో అభ్యర్థులు వరుసగా ఐదేండ్ల ఆదాయ పన్ను (ఐటీ) వివరాలను పొందుపర్చాలని, కానీ.. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోవా లక్ష్మి 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీ వివరాలను మాత్రమే సమర్పించాలని అజ్మీరా శ్యాం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మి ఎన్నికను రద్దు చేసి తాను గెలిచినట్టు ప్రకటించాలని కోరారు. దీనిపై ఈ నెల 1, 14, 16న విచారణ జరిపిన జస్టిస్ కే లక్ష్మణ్.. శుక్రవారం తన తీర్పును వెలువరించారు. రూల్స్ ప్రకారం లక్ష్మి తన ఆదాయం, పాన్ నంబర్, ఆస్తులు, అప్పుల వివరాలతోపాటు భర్త ఆదాయాన్ని కూడా ఎన్నికల అఫిడవిట్‌లో పొందుపర్చారని, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ కేసులో సుప్రీం కోర్టు పేర్కొన్న విధంగా ఆమె నామినేషన్ పత్రాన్ని సమర్పించారని పేర్కొంటూ.. పిటిషనర్ వాదనను తోసిపుచ్చారు. కేవలం ఒక్క ఏడాదికి సంబంధించిన ఐటీ రిటర్నులను మాత్రమే సమర్పించారన్న కారణంతో ఆమె ఎన్నిక చెల్లదని ప్రకటించలేమని తేల్చిచెప్తూ.. అజ్మీరా శ్యాం పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఎమ్మెల్యే లక్ష్మిపై ఎలక్షన్ పిటిషన్ దాఖలైన 9 నెలల 20 రోజులకే ఈ తీర్పు వెలువడటం విశేషం. ఫలితంగా హైకోర్టు చరిత్రలో అత్యంత త్వరగా వెలువడిన తీర్పుగా ఇది రికార్డులకు ఎక్కింది. దీంతో ఈ పిటిషన్‌పై విచారణ త్వరగా ముగిసేందుకు సహకరించిన వాదప్రతివాదుల తరపు న్యాయవాదులకు జస్టిస్ కే లక్ష్మణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వాస్తవానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎలక్షన్ పిటిషన్లను 6 నెలల వ్యవధిలోగా పరిష్కరించాలి. కానీ, గతంలో ఇలాంటి పిటిషన్లపై సదరు చట్టసభ సభ్యుల పదవీ కాలం ముగిశాక తీర్పులు వచ్చేవి. కోర్టుల్లో కేసుల సంఖ్య భారీగా పెరగడం వల్ల ఎలక్షన్ పిటిషన్లపై తీర్పులు రావడంలో విపరీతమైన జాప్యం జరిగేది.

కలెక్టర్ ఆఫీసుకు రాలే.. ఇంట్లో పన్నరా?

- కోపం వస్తే ఎలా తిడతానో తెలుసుకదా?
- తిట్టగానే ఐదు నిమిషాల్లో కలెక్టర్ వచ్చారు
- కాంగ్రెస్‌నేత జగ్గారెడ్డి వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్

సంగారెడ్డి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): పదిసార్లు ఫోన్‌చేసినా నా ఫోన్ ఎత్తనందుకు కలెక్టర్‌ను తిట్టానంటూ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి జన్మదిన వేడుకలను జూలై మాసంలో మైనార్టీ నాయకులు నాల్సాబ్‌గడ్డ చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి తాను కలెక్టర్‌ను తిట్టానంటూ ఉర్దూలో చేసిన వ్యాఖ్యలు శుక్రవారం వైరల్ అయ్యాయి. జగ్గారెడ్డి తన సొంత జిల్లా సంగారెడ్డి కలెక్టర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసినప్పటికీ.. కలెక్టర్ పేరును ప్రస్తావించలేదు. గతంలో పనిచేసిన కలెక్టరా లేక ప్రస్తుతం ఉన్న కలెక్టర్ గురించి జగ్గారెడ్డి మాట్లాడారా అన్నది స్పష్టంగా తెలియలేదు. ఉర్దూలో ఆయన ప్రసంగం ఇలా కొనసాగింది. 'కలెక్టర్‌కు పదిసార్లు ఫోన్ చేసినా నా ఫోన్ ఎత్తలేదు. కలెక్టర్ నా ఫోన్ ఎత్తకపోవటంతో బాగా కోపం వచ్చింది. ఇంట్లో ఏం చేస్తున్నారు కలెక్టర్ అని పీఏను అడిగాను. నాకు కోపం వస్తే ఎలా తిడతానో ఎవరికైనా తెలుసా, ఎలా తిడతానో మీకు తెలుసుగా. నేను పీఏకు చెప్పాను అరే భాయ్ మీ కలెక్టర్ సాబ్ ఫోన్ ఎత్తటంలేదు, కలెక్టర్ ఆఫీసుకు రావటంలేదు, ఇంట్లో పడుకుంటున్నారు. క్యా మర్‌కే బాజుక్ సోగయా క్యా (భర్త పక్కన పడుకున్నారా) అని అడిగా. నేను ఏమిచెప్పానో మీకు అర్థమైంది కదా! అర్థమైందా? లేదా? ఏక్ మరద్.. మరద్‌కే బాజుక్ సోగయా క్యా బోల్‌కే బోలా. ఇలా తిట్టగానే ఐదు నిమిషాల్లో కలెక్టర్ లైన్‌లోకి వచ్చారు. అధికారం ఉండొచ్చు ఉండకపోవచ్చు.. పవర్ ఉన్నా లేకున్నా జగ్గారెడ్డి గొంతుకకు (అవాజ్) దమ్ము విలువ ఉంటుంది..' అంటూ వ్యాఖ్యానించారు.

అభివృద్ధి ఫలాలు గిరిజనులకు అందాలి

- రెండు జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమం తీరు బాగుంది
- ఉమ్మడి జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఐడీవోసీలో రచయితలు, ప్రముఖులతో ముఖాముఖి

భద్రాద్రి జిల్లా భద్రాచలంలో సీతారామచంద్రస్వామి సన్నిధిలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)/ఖమ్మం/భద్రాచలం: అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులందరికీ అందాలని, ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం గవర్నర్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యారు. తొలుత భద్రాద్రి ఐడీవోసీలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. గవర్నర్‌కు ఎంపీలు రఘురాం రెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్ స్వాగతం పలికారు. జిల్లా ప్రాముఖ్యత, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. గవర్నర్ మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగున్నదని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73 శాతంగా ఉన్న రక్తహీనత శాతాన్ని 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఆర్డీవోలు మధు, దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖమ్మంలో పర్యటించిన గవర్నర్.. 'ధర్మో రక్షతి రక్షితః' అనే నినాదం ప్రకారం పర్యావరణాన్ని పరిరక్షించడం అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఉదయం భద్రాచలం సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న గవర్నర్‌కు అర్చకులు పరివట్టం కట్టి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద పూజలు చేసిన తర్వాత గవర్నర్‌కు అర్చకులు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

మాకూ ఓటు హక్కు కల్పించాలి

- ప్రైమరీ స్కూల్ టీచర్లూ పట్టభద్రులే
- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలైంది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం మండలం బండకాడిపల్లికి చెందిన సెకండరీ గ్రేడ్ టీచర్ బీమనబోయిన కృష్ణమూర్తి దాఖలు చేసిన పిల్‌ను శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎల్ శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రాబోయే ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేసే టీచర్లను ఓటర్లుగా పరిగణించేలా కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోరారు. డిగ్రీ చేసినప్పటికీ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ టీచర్లకు ఓటు హక్కు కల్పించకపోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఎన్నికల సంఘం తరపు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్ ఆ చట్టంలోని నిబంధన 27(3) (బి) సెక్షన్‌ను సవాలు చేయలేదని, పిల్‌లో ఉత్తర్వుల జారీ అవసరం లేదని అన్నారు. ఇందుకు అనుమతిచ్చిన కోర్టు విచారణను వాయిదా వేసింది.

జీవన్ రెడ్డి లేఖతో కాంగ్రెస్‌లో అలజడి

- తాజా పరిణామాలపై అధిష్ఠానం ఆరా
- టీపీసీసీ అధ్యక్షుడిని పిలిపించుకున్న హస్తిన పెద్దలు
- రేవంత్ ఒంటెద్దు పోకడలపై చర్చించే అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి హత్య. సొంతపార్టీపైనే జీవన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారుణంగా మారాయని విమర్శ. ఏకపక్ష చేరికలపై మండిపాటు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వేటు వేయాలని డిమాండ్. ఆక్రోశం అంతా వెల్లగక్కుతూ అధిష్ఠానానికి సుధీర్ఘ లేఖ. దీంతో రాష్ట్రంలో ఒంటెద్దు పోకడ విధానాలపై కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలు సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ పరిణామాల నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ శుక్రవారం హస్తినకు పయనం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసలు రాష్ట్ర పార్టీలో ఏం జరుగుతున్నదంటూ ఆరా తీయడానికే మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఢిల్లీకి పిలిచినట్టు సమాచారం. ఈ పర్యటనలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ముఖ్యనేతలతో భేటీ కానున్నారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులను వివరించనున్నారు. పార్టీ సంస్థాగత విషయాలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నారు. టీపీసీసీ కమిటీల కూర్పుపైనా చర్చించి అనుమతి తీసుకోనున్నారు. జీవన్‌రెడ్డి విషయంలో ఏ విధంగా ముందుకెళ్లాలనే విషయంపైనా పార్టీ పెద్దల సూచనలు తీసుకోనున్నట్టు వినికిడి. శనివారం సాయంత్రం ఢిల్లీలో వీహెచ్ పుస్తకావిష్కరణలో పాల్గొనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు పయనం కానున్నారు. ఇంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లిన మహేశ్ కుమార్‌గౌడ్.. ఈ సారి ఒక్కరే హస్తినకు వెళ్లడంపై పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతున్నది.

జీవన్‌రెడ్డి ఒంటరి కాదు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ, జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నికార్సయిన కాంగ్రెస్‌వాది అని, ఇటీవల అనుచరుడి హత్య విషయంలో ఆయన ఆవేదనను చూసి చాలా బాధ కలిగిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. జీవన్‌రెడ్డి ఒంటరి కాదని, కష్టకాలంలో ఉన్న ఆయనకు అండగా ఉంటానని స్పష్టంచేశారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో ఏమి జరుగుతున్నదో తెలియడంలేదని, నిత్యం జనాల మధ్య ఉండే జీవన్‌రెడ్డికి జీవితమంతా కష్టాలేనని శుక్రవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

మమ్మల్ని ప్రభుత్వంలో విలీనం చేయండి

సీఎస్‌కు టీజీఎస్ ఆర్టీసీ జాక్ వినతి

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని టీజీఎస్ ఆర్టీసీ జాక్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి ఆధ్వర్యంలో కో-కన్వీనర్ ఎండీ మౌలానా,యాదయ్య, సురేశ్, యాదగిరిలతో కలిసి శుక్రవారం సచివాలయంలో సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టీఎన్జీవో జేఏసీలో చేరిక

టీఎన్‌జీవో జాక్‌లో టీజీఎస్ ఆర్టీసీ జాక్ చేరింది. హైదరాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో జేఏసీ చైర్మన్ జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావులతో ఆర్టీసీ జేఏసీ చైర్మన్, వైస్ చైర్మన్, ఇతర నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జాక్ చైర్మన్ ఎం.జగదీశ్వర్, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, ఇతర సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ జాక్‌కు సహకరిస్తామని ప్రకటించారు. అనంతరం రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్‌ని కలిసి ఉద్యోగుల వివరాలను అందజేశారు.

మరో 1500 కోట్ల అప్పు!

ఇప్పటికే కాంగ్రెస్ సర్కార్ తెచ్చిన రుణం 74,618 కోట్లు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీఐ వద్ద మరో రూ.1,500 కోట్ల అప్పుగా తీసుకుంటున్నది. ఈ రుణాన్ని ఆర్బీఐ ఈ నెల 29న విడుదల చేయనున్నది. గత సెప్టెంబర్‌లో మూడు దఫాలుగా రూ.4,500 కోట్ల రుణం పొందిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అక్టోబర్ ఒకటో తేదీన రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది. ఇప్పుడు తాజాగా మరో రూ.1,500 కోట్లు అప్పు పొందనున్నది. ప్రతి నెలా రూ.5 వేల కోట్ల నుంచి రూ.6 వేల కోట్ల విలువైన బాండ్ల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వుబ్యాంకు నుంచి అప్పు తీసుకుంటున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇప్పటివరకు ఆర్బీఐ నుంచే 49,618 కోట్లు,. గ్యారెంటీలు ఇచ్చి రూ.25 వేల కోట్ల వరకు సేకరించింది. ఇప్పటివరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.74,618 కోట్ల అప్పు చేసింది.

ప్రజావాణికి 509 అర్జీలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 509 దరఖాస్తులు వచ్చాయి.

భీమారం పోలీస్ స్టేషన్ గేట్ ముందు కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పోలీస్‌స్టేషన్ ఎదుట బర్త్‌డే వేడుకలు

- కాంగ్రెస్ నాయకుడి నిర్వాకం
- హస్తం నాయకుల తీరుపై విమర్శలు

భీమారం, అక్టోబర్ 25 : ఓ కాంగ్రెస్ నాయకుడు ఏకంగా పోలీస్ స్టేషన్ ఎదుటే బర్త్‌డే వేడుకలు జరుపుకొన్నాడు. మంచిర్యాల జిల్లా భీమారం పోలీస్ స్టేషన్ గేట్ ఎదుట శుక్రవారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు గుడ్డు తిరుపతి జన్మదిన వేడుకలు నిర్వహించాడు. గేటు ముందు దర్జాగా బైక్ నిలిపి దానిపై కేక్ పెట్టి కోశారు. ఈ వేడుకలో నాయకులు పోడెటి రవి, మాజీ జడ్పీటీసీ జర్పుల రాజ్ కుమార్, ఉష్కమల్ల శ్రీనివాస్, భూక్య లక్ష్మణ్‌నాయక్, కోట రవి, చెడంక తిరుపతి, అనపర్తి రమేశ్ పాల్గొన్నారు. ఇంత జరుగుతున్నా అక్కడున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అడ్డుకోకపోవడంపై స్థానిక ప్రజలు, ఇతర పార్టీల నాయకులు భగ్గుమంటున్నారు. ఈ విషయమై ఎస్సై శ్వేతను వివరణ కోరగా.. మర్యాదపూర్వకంగా తనను కలవడానికి వచ్చినట్టు తెలిపారు. స్టేషన్ బయట వేడుకలు జరుపుకొన్నట్టు సోషల్ మీడియాలో చూసి వారిని ప్రశ్నించినట్టు పేర్కొన్నారు.

హైడ్రాపై ప్రభుత్వానికి నోటీసులు

కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్‌ను సవాలు చేస్తూ బీఆర్ఎస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి దాఖలుచేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసిన న్యాయస్థానం పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తుదపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావడంపై వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శులకు నోటీసులు జారీచేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం ఆదేశాలు జారీచేసింది.

హైడ్రా అధికారాలు చెల్లవు

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువుల రక్షణ, ఆక్రమణల తొలగింపుతోపాటు విపత్తుల సమయంలో తగిన చర్యలు చేపట్టే నిమిత్తం ప్రభుత్వం హైడ్రాకు విస్తృతాధికారాలు కల్పిస్తూ ఈనెల 3న ఆర్డినెన్స్ జారీచేసింది. దీనిని మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి (బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కుమారుడు) హైకోర్టులో సవాలు చేశారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఆర్డినెన్స్ వల్ల హైడ్రాకు విస్తృతాధికారాలను కట్టబెట్టడం చట్ట వ్యతిరేకమని చెప్పారు. జీహెచ్ఎంసీ చట్టంలోని సెక్షన్ 374బీ ద్వారా హైడ్రాకు ఆర్డినెన్స్ ద్వారా ప్రభుత్వం అధికారాలు కల్పించడం చెల్లదని అన్నారు. హైడ్రాకు అధికారాలను కట్టబెట్టే అధికారం, ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఆర్డినెన్స్‌ను సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. నిరాకరించిన హైకోర్టు, ప్రతివాదుల వాదనల తర్వాతే ఉత్తర్వుల జారీకి ఆస్కారం ఉంటుందని స్పష్టం చేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

అరబిందో కంపెనీని తగలబెడతా

- అసెంబ్లీలో చర్చ జరిగినా కాలుష్యకారక ఫార్మా కంపెనీలపై ఎందుకు చర్య తీసుకోవట్లేదు?
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- స్పీకర్‌కు లేఖ రాసిన జడ్చర్ల ఎమ్మెల్యే

అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాలుష్యం నీటిని బయటకు వదిలితే పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా కంపెనీని తగలబెడతానంటూ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో పోలేపల్లి సెజ్‌లోని శిల్ప, అరబిందో కంపెనీలు కాలుష్యాన్ని వెదజల్లుతున్న విషయాన్ని సభ దృష్టికి తీసుకెళ్లానని, అయినా ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన అనిరుధ్‌రెడ్డి కొన్నిరోజులుగా స్వపక్షంలో విపక్షంగా మారి ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. శుక్రవారం ఆయన జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఆ కంపెనీపై చర్యలు తీసుకోవాలంటూ స్పీకర్‌కు లేఖ రాసినట్టు వెల్లడించారు. అరబిందో ఫార్మా కంపెనీ కాలుష్య జలాలను ముదిరెడ్డిపల్లి చెరువులోకి పంపిస్తుండటంతో చేపలు చనిపోతున్నాయని, మత్స్యకారుల పెట్టుబడులన్నీ నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ చెరువు మంచినీటి వనరుగా ఉన్నదని పేర్కొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో కాలుష్యంతో అనేక దుష్ఫలితాలు వస్తున్నాయని స్పీకర్‌కు రాసిన లేఖలో వివరించారు. డబ్బులు ఇచ్చి అధికారులను, రాజకీయ నాయకులను కొనవచ్చనే భ్రమలో అరబిందో కంపెనీ ఉన్నదని ఆరోపించారు. తాను రైతుల పక్షాన ఉంటానని, ఈ కంపెనీపై చర్య తీసుకోకపోతే తానే యాక్షన్‌లోకి దిగుతానని హెచ్చరించారు.

పోలీసుల వైద్యానికి డబ్బుల్లేవ్!

'పోలీసులను కాపాడుకోవటమే నా ధ్యేయం.. వారికి కష్టమొస్తే నేను కన్నీటి బొట్టునవుతా..' పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి.

- నిధులు లేవంటున్న పోలీసు శాఖ
- వైద్యానికి నిరాకరిస్తున్న దవాఖానలు
- పైసలిస్తేనే వైద్యం చేస్తామంటున్న యాజమాన్యం
- ఇబ్బందుల్లో పోలీసు కుటుంబాలు

హైదరాబాద్, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): సాక్షాత్తు సీఎం అన్న మాటలు నీటి మూటలుగా మారాయి. మీకు నేనున్నానని చెప్పిన మూడ్రోజులకే 'పోలీసు ఆరోగ్య భద్రత' పథకాన్ని అటకెక్కించే ఏర్పాట్లు జరిగాయి. 'పోలీసు ఆరోగ్య భద్రత' కార్డు అంటేనే దవాఖానలో వైద్యం అందని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కోట్లాది రూపాయిల బకాయిలను దవాఖానలకు చెల్లించకపోవడం, పోలీసుల నుంచి వసూలు చేసే నెలకు రూ.200 ఎటూ సరిపోకపోవడంతో.. మీ డబ్బులతో మీరే వైద్యం చేయించుకొమ్మని పోలీసు ఆరోగ్య భద్రతా విభాగం చేతులెత్తేసింది. ఈ మేరకు ఇటీవల ఓ నోట్‌ను విడుదల చేసింది. పోలీసు సిబ్